క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న ఆర్డీటీ సిబ్బంది

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి రోజూ రక్తం కోసం వచ్చే రోగుల సంఖ్య పెరగడంతో ఆయా ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, ఏటీఎల్ మీనాక్షి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, సిబ్బంది, డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

కూడేరు: వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన పక్కా ఇళ్లను లబ్ధిదారులు తొందరగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ శేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఇంకా మండల వ్యాప్తంగా 213 మంది పూర్తిగా నిర్మాణాలు మొదలుపెట్టలేదు. ఆ లబ్ధిదారులను కలిసి వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చైతన్యపరచాలని ఆయన సూచించారు. ఇంకా 700కు పైగా ఇళ్ల వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇసుక, సిమెంట్ సకాలంలో అందించి నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. బిల్లులు మంజూరులో జాప్యం చేయవద్దని ఆయన సూచించారు.

'దళితుల కేసులపై నిర్లక్ష్యం వీడాలి'

కళ్యాణదుర్గం: దళితుల కేసులపై పోలీసులు నిర్లక్ష్యం వీడాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం జేఏసీ తాలూకా ఇన్‌చార్జ్ చెలిమప్ప, సీనియర్ నాయకులు గోనేపల్లి దొణస్వామి, బ్రాహ్మణపల్లి తిప్పేస్వామి, డీఎస్ఎస్ వ్యవస్థాపకుడు అంకే తిప్పేస్వామి, రామాంజినేయులు తదితరులు విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లిలో ఈ నెల 11న మాదిగ శ్రీరాములపై అదే గ్రామానికి చెందిన శంకరయ్య, తిమ్మరాజు కులం పేరుతో దూషిస్తూ చెప్పులతో కొట్టి అవమానించారన్నారు. ఈ విషయంపై బ్రహ్మసముద్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఐదు రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై బాధితుడైన శ్రీరాములుపై పోలీసులు కౌంటర్ కేసు దాఖలు చేసేలా ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. కౌంటర్ కేసులతో భయపెడితే జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులతో కలిసి ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

గ్రామ సచివాలయాల్లో 546 రకాల సేవలు


కలుగోడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శంకర్

గుమ్మఘట్ట: గ్రామ సచివాలయాల్లో 546 రకాల సేవలు అందిస్తామని డీఎల్‌డీఓ శంకర్ తెలిపారు. మండలంలోని భూపసముద్రం, రంగచేడు, కలుగోడు గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు, టీటీడీ రిజర్వేషన్, రైల్వే టికెట్ల బుకింగ్, ఆధార్ సేవలు తదితర సేవలను ప్రజలకు అందిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. అన్నిరకాల సేవలను గ్రామీణప్రాంత ప్రజలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సమయపాలన పాటించడంతో పాటు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం గ్రామ వలంటీర్లతో ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేతపద్మిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లిలో భూతగాదాలో ముగ్గురిపై కేసు నమోదు చేసామని ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు. నక్కలపల్లికి చెందిన సుంకమ్మ కుటుంబానికి చెందిన 94-1, 96-2 సర్వే నెంబర్లలోని భూమిని శుక్రవారం సర్వే చేయిస్తుండగా గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, లోకేష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి దౌర్జన్యం చేస్తూ భూమి తమదే అంటూ మారణాయుధాలతో దాడికి యత్నించారు. సుంకమ్మ ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడిన ముగ్గురిపైనా కేసులు నమోదు చేసామని ఎస్‌ఐ తెలిపారు.

ఆశాజనకంగా రబీ పంటలు

- పెరిగిన భూగర్భజలాలు
- డివిజన్‌లో 14,794 హెక్టార్ల సాగు

రబీ పంటల సాగు వివరాలు..

పంట	సాధారణ సాగు (హెక్టార్లలో)	ప్రస్తుత సాగు (హెక్టార్లలో)
మొక్కజొన్న	404	1,263
పప్పుశనగ	7,095	6,782
వేరుశనగ	5,719	4,788
టమాట	1,594	1,500
మిరప	80	32
వరి	324	186
ఉల్లి	108	34


శెట్టూరు మండలం బసంపల్లి వద్ద సాగు చేసిన వేరుశనగ


బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట వద్ద సాగు చేసిన మొక్కజొన్న

కళ్యాణదుర్గం: ఈ ఏడాది రబీ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే ఈసారి భూగర్భ జలాలు పెరగడంతో రైతన్నలు వ్యవసాయంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. గతంలో బీళ్లుగా వదిలేసిన పొలాలను సైతం రబీ సీజన్‌లో పంటల సాగు చేస్తూ పొలాల్లో బిజ బిజీగా గడుతుపున్నారు. ఖరీఫ్ సీజన్‌తో పాటు రబీలో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది.

14,794 హెక్టార్లలో సాగు

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లోని కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప మండలాల్లో ఈ సారి రబీ పంటల సాగు పెరిగింది. మొక్కజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటల సాధారణ సాగు 15,885 హెక్టార్లు కాగా, ఈ ఏడాది రబీలో సుమారు 14,794 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. కాగా ప్రస్తుతం ఆయా పంటల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. దిగుబడి సైతం ఆశాజనంగా ఉన్నట్లు పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సారి పంట బాగుంది

ఈ ఏడాది రబీలో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను వేశాను. పంట కళకళలాడుతోంది. ప్రస్తుతం పంట కాయ దశలో ఉంది. ఈసారి మంచి దిగుబడి వస్తుందని ఆశగా ఉంది. పంట దిగుబడితో పాటు గ్రాసం కూడా లభిస్తుంది.

– పాలబండ్ల జోతన్న, రైతు, బసంపల్లి



10 ఎకరాల్లో వేరుశనగ వేశాను

10 ఎకరాల్లో వేరుశనగ పంట వేశాను. సుమారు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాను. దాదాపుగా 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఇప్పుడు వేరుశనగ క్వింటాళ్ ధర రూ.7 వేలు పలుకుతోంది. ఈ లెక్కన సుమారు రూ.4 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది.

– దాసరి రామన్న, రైతు, ముప్పలకుంట



రూ.45 లక్షలతో 'జోడు లింగాల' రథం!


టేకు కట్టెని తీసుకువస్తున్న వాహనాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతి గాంచిన కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి సుమారు రూ.45 లక్షలతో రథాన్ని తయారు చేయించేందుకు దాతలు ముందుకు వచ్చారు. శుక్రవారం ఉరవకొండ మండలం నింబగల్లు, మహదేవపురం, చిత్రదుర్గానికి చెందిన కోకా వంశీకులు రథం తయారీకి అవసరమై టేకు కట్టెని సుమారు రూ.11లక్షలు వెచ్చించి కూడేరుకు తీసుకువచ్చారు. భక్తులు భజనతో గ్రామంలో నుంచి దేవాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ నూతన రథం తయారీకి సుమారు రూ.45 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. త్వరలో మరో రూ.5 లక్షలు వెచ్చి మత్తి కట్టెని తీసుకు వస్తామన్నారు. ఇతర భక్తులతో కూడా విరాళాలు సేకరిస్తామన్నారు. రథం తయారీ పనులను వేగవంతం చేయించి వచ్చే ఏడాదికి నూతన రథం తయారయ్యేలా కృషి చేస్తామన్నారు.

ఆధ్యాత్మిక విలువలు పెంపొందించాలి


జామియా మసీదులో మక్తబ్‌లో సూరాలు చదివి వినిస్తున్న చిన్నారులు

రాయదుర్గంటౌన్: చదువుతోపాటు విద్యార్థి దశ నుంచే పిల్లల్లో ఖురాన్, హదీస్‌ల పట్ల ఆధ్యాత్మిక విలువలను పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని మౌలానా ఏజాజ్ ముస్తఫా అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని జామియా మసీదులో చిన్నారుల ముక్తబ్ (జల్సా) ముగింపు సదస్సును నిర్వహించారు. దాదాపు 50 మంది బాలబాలికలు పాఠశాలలకు వెళుతూనే గంటపాటు మసీదులో ఖురాన్, హదీస్, నమాజ్‌లో చదివే సూరాలు ఇతర ధార్మిక విద్యపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఖురాన్ షరీఫ్ నేర్పితే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ప్రయోజనం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలు, ఆధ్యాతిక బోధనలు చిన్నతనం నుంచి అలవర్చాలన్నారు. అనంతరం దువా పఠించి స్వీట్లు, ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మౌలానా జుబేర్, మసీదు ముతవల్లి బాషాసాబ్, వివిధ మసీదుల మౌలానాలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలి

రాయదుర్గంటౌన్: సరిహద్దులో ఉన్న కర్ణాటకలోని ముఖ్యమైన నగరాలకు రాయదుర్గం నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని పట్టణవాసులు గుడేకోట శివకుమార్, రామాంజనేయులు, దాదు, శివకుమార్, ఈరణ్ణ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం డిపో మేనేజర్ సురేష్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. కర్ణాటకలోని అనేక ప్రాంతలకు గతంలో నడపుతున్న సర్వీసులను ప్రస్తుతం రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటు వ్యాపార నిమిత్తం పట్టణం నుంచి కర్ణాటకకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాయదుర్గం నుంచి కూడ్లిగి, మైసూరు, ధర్మస్థలం, మంగళూరు బస్సులు ప్రవేశపెట్టాలని వారు కోరారు.

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం


బొమ్మనహాళ్: వర్షానికి దెబ్బతిన్న మిర్చి పంటను ఆరబెడుతున్న రైతులు


కూడేరు: ఉదిరిపికొండలో ఓ ఇంటి గుమ్మం ముందు పడిన వడగండ్లు

బొమ్మనహాళ్: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గోవిందవాడ, కల్లుదేవనహాళ్లి, తారకాపురం, కల్లుహోళ గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన పండు మిరప తడిసిపోయింది. దాదాపుగా 45 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. అలాగే మండలంలోని బండూరు, ఉద్దేహాళ్ గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది.

కలగళ్ల,ఉదిరిపికొండలో వడగండ్ల వాన

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ, కలగళ్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఇళ్ల గుమ్మాల ముందు కుప్పలుగా వడగండ్లు నిలిచాయి. పిల్లలు వడగండ్లతో ఆడుకుంటూ సరదాగా గడిపారు.

హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

డి హీరేహాళ్(రాయదుర్గం): డీహిరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి హుండీ కానుకలను లెక్కించగా రూ.14,71,934 ఆదాయం సమకూరినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్, దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో 15-03-2022 నుంచి 15-03-2023 వరకూకు సంబంధించి హుండీలోని కానుకలను లెక్కించారు. దేవదాయ శాఖ సిబ్బంది జితేంద్ర పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లిపెద్ద తండా గ్రామ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన లాలు నాయక్, పార్వతి దంపతులు ద్విచక్ర వాహనంలో వెంకటాంపల్లి పెద్దతండా నుంచి గుంతకల్లుకు బయలుదేరారు. మార్గమధ్యంలో పందికుంట సమీపంలో ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఘటనలో పార్వతి తలకు తీవ్ర గాయాలు కాగా, లాలునాయక్‌కు స్వల్ప గాయా లయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం

కుందుర్పి: మండలంలోని రబీ వేరుశనగ పంటకు రాత్రిళ్లు అడవి పందుల బెడత ఎక్కువైందని జంబుగుంపల, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి తదితర గ్రామాల రైతులు వాపోయారు. అసలే తెగుళ్లతో అరకొరగా ఉన్న పంటను పందులు నాశనం చేస్తుండడంతో వేలాది రూపాయల నష్టం వాటిల్లుతోందన్నారు. గురువారం రాత్రి కెంచంపల్లి రైతులు రాజప్ప, ఓబుళపతి, బాబు, తిప్పేస్వామి తదితరకు చెందిన వేరుశనగ పంటను పందులు ధ్వంసం చేశాయని, ఆదుకోవాలంటూ అటవీ అధికారి పరమేశ్వరప్పకు ఫిర్యాదు చేశారు.

కణేకల్లు–మాల్యం రహదారికి మోక్షం

- ఆరు నెలలుగా ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు
- సమస్య పరిష్కారమవడంతో ప్రజల హర్షం


వేదావతి హగిరిపై నిర్మించిన అప్రోచ్ రోడ్డు

కణేకల్లు: కణేకల్లు–మాల్యం రహదారికి మోక్షం లభించింది. ఐదు రోజుల నుంచి కణేకల్లు–మాల్యం గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన అప్రోచ్ రోడ్డు పనులు శుక్రవారం పూర్తయ్యాయి. ఈ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకోపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కణేకల్లు–ఉరవకొండకు వెళ్లాలంటే మాల్యం గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంది. వేదావతి హగిరిపై ఉన్న అక్విడెక్ట్‌కు కాలం చెల్లి ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో.. వాహనాల రాకపోకలను హెచ్చెల్సీ అధికారులు నిషేధించారు. బస్సులు, లారీలు రావడం లేదు. కార్లు, ఆటోలు, జీపులు మాత్రమే తిరుగుతున్నాయి. మరో వైపు ఉరవకొండ నుంచి కణేకల్లుకు రావాల్సిన బస్సులు మాల్యం వరకే వచ్చి వెనుదిరుగుతున్నాయి. దీంతో హెచ్చెల్సీ గట్టు రోడ్డుపై ప్రయాణికులు ఆటోల్లో రాకపోకలు సాగించే వారు. రెండు కిలోమీటర్ల ప్రయాణానికి 20 నిమిషాల సమయం పట్టేది. అనేక అవస్థలు పడి ప్రజలు ప్రయాణాలు చేసేవారు. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కణేకల్లులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికొచ్చిన సమయంలో ప్రజలు కణేకల్లు–మాల్యం డైరెక్ట్ రోడ్డును నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్, టెన్త్ పరీక్షల సమయంలో విద్యార్థులు కణేకల్లుకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని సరైన సమయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని చెప్పడంతో వేదావతి హగిరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు చేయిస్తానని హామీచ్చారు.

వేగవంతంగా పనులు

కణేకల్లు శివారులోని వేదావతి హగిరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని విప్ కాపు రామచంద్రారెడ్డి అధికారులకు ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి దగ్గరుండి పనులు చేయించారు. గ్రావెల్‌తో అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నారు. అలాగే రోలర్‌తో రోడ్డుగట్టును పటిష్టీకరిస్తున్నారు. వేదావతి హగిరిలో నీటి ప్రవాహం కోసం 16 పెద్ద పైప్‌లు వేసి కల్వర్ట్‌ల నిర్మాణం చేపట్టారు. అడిగిన వెంటనే కణేకల్లు–మాల్యం రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు

ఉరవకొండ–కణేకల్లు బస్సుల రాకపోకలు శనివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆరు నెలల నుంచి ఉరవకొండ–కణేకల్లు బస్సులన్నీ మాల్యం గ్రామంలోనే ఆగి.. అటు నుంచి అటే వెళ్లిపోయేవి. దావతి హగిరిలో నూతన అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఆర్టీసీ అధికారులు బస్సుల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తి పన్ను బకాయిలకు వడ్డీ మినహాయింపు


ప్రత్యేక పన్ను వసూలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బంప్ ఆఫర్ ప్రకటించింది. పెండింగ్‌తోపాటు రెగ్యులర్‌గా ఆస్తి పన్ను కట్టే వారికి వంద శాతం వడ్డీ రాయితీ ప్రకటించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలను చెల్లిస్తే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వంద శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుల్లో మాత్రమే వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు. బకాయిలకు సంబంధించి అసలును ఈ నెల 31లోగా చెల్లించిన వారికే మాత్రమే వడ్డీ మినహాయింపు లభిస్తుందని, అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పన్ను వసూలు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇప్పటిదాకా పన్నులు చెల్లించని వారిని చైతన్యపరిచి వడ్డీ మినహాయింపుపై అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వసూలు కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. వంద శాతం పన్నుల వసూలుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

ఆస్తి పన్ను వసూళ్లలో రెండో స్థానంలో 'రాయదుర్గం' ఆస్తి పన్ను వసూళ్లలో రాయదుర్గం మున్సిపాలిటీ మంచి పురోగతితో ముందుకు సాగుతున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. 72 శాతం వసూలుతో జిల్లాలో రెండోస్థానంలో కొనసాగుతోందన్నారు. మొత్తం డిమాండ్ రూ. 3.22 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి దాకా రూ.2.30 కోట్లు వసూలు చేశామన్నారు. అలాగే రూ.2.97 కోట్ల నీటి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.90.25 లక్షలు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు.

రైతులు అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

కూడేరు: రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలోపేతం చెందేలా కృషి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటరాముడు మండల అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన కూడేరులోని రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ద్వారా రైతులకు అందించిన సేవలను పరిశీలించారు. సామాజిక తనిఖీలో భాగంగా రబీలో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను నోటీసు బోర్డులో పొందుపరిచారా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన వ్యవసాయ కార్యాలయంలో ఏఓ నవత, ఏఈఓ శైలజ, వీఏఏలు , ఎంపీఈఓలతో సమావేశమయ్యారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలపై రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం గురించి ఇప్పేరు, కూడేరు, ముద్దలాపురం, గొటుకూరు రైతులను చైతన్యపరచాలన్నారు.

నాణ్యమైన విద్య అందజేయాలి


ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ అలెస్కో రవి

రాయదుర్గంటౌన్: బోధన సామర్థ్యాల్లో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయాలని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ అలెస్కో రవి, అసిస్టెంట్ సీఎంఓ తిప్పేస్వామి ఆదేశించారు. పట్టణంలోని ఏఎఐ మున్సిపల్ ఉర్దూ పాఠశాల, కేజీబీవీ, భవిత సెంటర్లను శుక్రవారం సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత పట్టణంలోని ఏఎఐ ఉర్దూ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అక్కడి నుంచి కేజీబీవీని సందర్శించి ఉపాధ్యాయినిలతో సబ్జెక్టుల వారిగా లెసన్ ప్లాన్‌లు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, నాణ్యత లోపం లేకుండా రుచికరమైన భోజనం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగమణి, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత


బాధితుడి కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న అధికారులు

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లికి చెందిన చిన్నపల్లిమూర్తి (36) అనారోగ్యంతో బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మృతుడి భార్య రాధమ్మకు వైఎస్సార్ బీమా కింద తక్షణసాయం రూ.10 వేల నగదును శుక్రవారం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సర్పంచ్ అనంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగలక్ష్మి, గ్రామస్తులు తిమ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమిపూజ


పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి

కుందుర్పి: మండలంలోని కరిగానిపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కింద మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో శుక్రవారం సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి స్వగ్రామమైన కరిగానిపల్లిలో పీర్ల స్వామి ఆలయం నుంచి దురగమ్మ ఆలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మించనున్నారు. ఇప్పటికే బెస్తరపల్లిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మమత, వార్డు సభ్యుడు మల్లికార్జున, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.